www.suryaa.com

# ప్రజ్ఞ

suryaapragna71@gmail.com

బుధవారం 12 జూన్ 2024 | పేజీలు 8



ఓటమి
2లో..










# తీర్పు 2024

# మళ్ళీ సంకీర్ణశకం..



భూగోళశాస్త్రం 6లో...




ఎకానమి 5లో..



ఆర్థిక గణాంకశాస్త్రం 7లో..

సూర్య
బుధవారం 12 జూన్ 2024

# పోటీపరీక్షల ప్రత్యేకం

# ఓటమి




**అది ఏ రంగమయినా, ఎవరినైనా ఓటమి అనేది తీవ్రంగా బాధిస్తుంది. ఆ ఓటమికి బాధ్యత తీసుకునేవారిని అది మరీ పీడిస్తుంది. నాకు తెలిసి ఓటమి అనేది నల్లగా చిక్కగా చీకటిలాగా ఉంటుంది. అందుకనే అది మనిషిని చీకటి చాటుకు నెట్టివేస్తుంది. జీవితంలో బహుశా ప్రతి దానికి ఎక్కువ హోప్ పెట్టుకొని అది నెరవేరకపోతే వచ్చే ఓటమిని మనిషి గుండె తట్టుకోలేదేమో! అందుకనే గుండె రక్తాన్ని పిండేసి, దానిని కన్నీళ్ళ కింద మార్చి కంటి రెప్పల ద్వారా నేలపై పడేటట్లు చేస్తుంది.**

తనకు అంతా మంచే జరుగుతుందని ప్రతి మనిషి అనుకుంటాడు. సాఫీగా సాగినంతకాలం బాగానే ఉంటుంది. ఒక్కోసారి తనవల్లే తెల్లారుతుంది అని కూడా అనుకుంటాడు. తాను అందరికన్నా అధికుడనని ఒక రకమయిన ధీమాకి వెళ్ళిపోతాడు. ఈ లోగా ఇగో వచ్చి చేరుతుంది. ఇక మనుషులు కనపడరు. తాను అతీతుడనని, దైవ సమానుడనని ట్రాన్స్‌లోకి వెళ్ళిపోతాడు. ఒక ఊహా ప్రపంచాన్ని కట్టుకొని ఆ గోడల మధ్యే ఉండిపోతాడు. తనచుట్టూ జరిగే మార్పులను పట్టించు కోడు. తను కళ్ళు మూస్తే రాత్రవుతుందని, కళ్ళు తెరిస్తే తెల్లవారుతుందనే భావనలో ఉంటాడు.

**వాస్తవాన్ని ఒప్పు కోక తప్పదు...**

ఇలాగ ఉన్న నేపథ్యంలో ఒక్కసారిగా తన కోటకు బీటలు వారితే, ఊహా ప్రపంచానికి గండిపడితే, అతను లేదా ఆమె గుండె తట్టుకోలేదు. కానీ వాస్తవాన్ని ఒప్పుకోక తప్పదు. వాస్తవం ఎర్రగా, కఠినంగా ఉంటుందేమో? చూడగానే అది భయపెడుతుంది. కానీ వాస్తవమే నిజమయిన జీవితం. ఒప్పుకొని తీరవలసిందే. మెల్లమెల్లగా వాస్తవానికి అలవాటు పడవలసిందే.

**గౌరవాన్ని, స్థితిని నిలబెట్టుకోవాలి....**

సమాజంలో ఒక్కొక్కరికి ఒక్కోసారి నడమంత్రపు సిరి వచ్చిపడుతుంది. మరి కొందరికి అందనంత గౌరవం వస్తుంది. అంతటి గౌరవాన్ని వారు ఊహించి ఉండరు. కానీ ఈగౌరవాన్ని, స్థితిని నిలబెట్టుకోవాలి. కాపాడుకోవాలి. గ్రీకు తత్త్వవేత్త అరిస్టాటిల్ ఒకమాట న్నాడు. ఒక వ్యక్తి వ్యక్తిత్వాన్ని మనం అర్థం చేసుకో వాలంటే అతనికి అధికారం ఇచ్చి చూడాలి. అరిస్టాటిల్ ఎలాంటి అధికారం ఇచ్చి చూడాలో చెప్పలేదు గానీ అధికారం మనిషిని అంధకారంలోకి నెడుతుందని మాత్రం చెప్పదలచి ఉండవచ్చు.

**ఓటమి గట్టిపాఠం నేర్పుతుంది....**

ఓటమి గట్టిపాఠం నేర్పుతుంది. అది మన దృక్పథాన్ని మారుస్తుంది. చూసే చూపును మారుస్తుంది. గుంతల రోడ్డువైపు వెళితే గట్టి దెబ్బ తగులుతుందని, కనుక ఆ దారిన మరెప్పుడు ప్రయాణించకూడదని చెపుతుంది. నిన్ను అందరూ వదిలేసి వెళ్ళిపోతారని చెపుతుంది. నీవు మరింత బలోపేతుడై లేచి నిలబడతావని చెపుతుంది. నీవు రెండింతల మనిషివి అవుతావని గట్టిగా చెవిలో చెప్పి వెళుతోంది.

సాధారణంగా ఓటమికి వారసులు కావాలని ఎవరూ అనుకోరు. అది అలా వచ్చేస్తుంది. అలా వచ్చినపుడే గట్టి గట్టుని నిర్మించుకోగలం. ఆదిమానవుడు అనుకునే వాడట-కంటికి కనపడిందల్లా తిని బలంగా ఉండవచ్చుని. కానీ పోయేకొద్దీ తనకు తెలిసిందీ అన్నింటినీ తినలేము, కొన్ని చేదుగా ఉంటాయి. కొన్ని తియ్యగా ఉంటాయి, మరికొన్నింటిని తింటే చనిపోతామని. ఇది ఒక్కరోజులో తనకు తెలియలేదు. కొన్ని కోట్ల సంవత్సరాలకు ఇలాంటి తత్వం బోధపడింది. అతనిముందు మనమెంత? గట్టిగా 70 ఏళ్ళు బతుకుతామో ఏమో?! ఇందులో బలం ఇరవై ఏళ్ళు ఉంటుంది. మంచి చేసినా, చెడు చేసినా ఈ ఇరవై ఏళ్ళదే చివరివరకూ వస్తుంది. మంచి చేయగలిగితే నీతోపాటు అందరూ చివరివరకూ దానిని గుర్తు పెట్టుకుంటారు. రేపటి రోజున నీవు గుర్తొస్తే ఏడుస్తారు. చెడుచేస్తే మరచిపోతారు.

ఒక ఆసుపత్రి వద్ద వందల మంది గుమిగూడి ఉన్నారు. ఏంటని ఆరా తీసాను. ఒకతను చెప్పాడు 'వాళ్ళ ఊరి సర్పంచ్ ఆసుపత్రిలో ప్రాణాలతో పోరాడుతున్నాడట. అతను బతకాలని బయట వీరందరూ తమ మనోశక్తిని, ప్రాణశక్తిని అతని ప్రాణానికి తోడుగా పంపుతున్నారు. పరవాలేదు, ఈ రోజుల్లో ఒక రాజకీయ నాయకుడికి ఇలా కూడా ఉన్నారా?! అనిపించింది.

రెండోరోజు ఆ ఆసుపత్రి వద్ద ఒక్కరూ లేరు. వాకబు చేయగా అతను బ్రతికాడు. డిస్చార్జి అయ్యాడు. అతనిని, ఈ వచ్చిన వేలాది మంది తీసుకొని వారి ఊరికి వెళ్ళిపోయారు. ఇది విన్న నాకు చాలా సంతోషం వేసింది.

మనం ఎన్నోసార్లు అనుకున్నాం. మనం మనుషులం. మన ఎమోషన్స్‌ని బాగా బయటికి చెప్పగల జీవులం మనం. తొలుత అంతర్మథనం చెందినా తుదకు అర్థం అయ్యేలా అందరికీ చెప్పగలం. మనం మను షులం. ఓటమి, కష్టాలు వచ్చినపుడు ఏడుస్తాం. సుఖాలు, సంతోషాలు వచ్చినపుడు గంతులేస్తాం. కానీ రెండిటికీ ఒకేలా ఉండమంటారు చాలామంది. కానీ అది మనవల్ల కాదు. ఎందుకంటే మనం మనుషులం. కష్టానికి, సంతోషానికి ఒకేలా ఉండమంటే అలా ఎలాంటి ఫీలింగ్స్ లేని భౌతిక పదార్థం ఉండగలుగుతుందేమో గాని మనిషి వల్ల కాదు.

**కాలం గాయాలను మాన్పుతుంది...**

ఈ రోజు బాధ రేపటికి పలచబడుతుంది. రెండ్రోజులకి పాతబడుతుంది. మరికొన్ని రోజులకి మరచిపోయేలా చేస్తుంది. ఇది మన ప్రమేయం లేకుండానే సహజంగా జరిగే ప్రక్రియ. దీనికి యోగాలు-ధ్యానాలు అవసరం లేదు. కాలం గడిచిపోతూ ఉంటే చాలును.

మనుషులు చాలా విషయాలను త్వరగా మరచిపోతారు. ఉదాహరణకు ఈరోజు మధ్యాహ్నం ఏ కూర వేసుకొని భోజనం చేసారని సాయంత్రం ఐదింటికి అడిగితే గట్టిగా చెప్పలేరు. కానీ కొన్ని విషయాలను బలంగా గుర్తుంచుకుంటారు. ఎంతగా అంటే అది గుర్తొచ్చినప్పుడల్లా ప్రాణంలో కలుక్కుమంటుంది. మన జీవతంలో ఓటమి కూడా అలాంటిదే. ఇప్పుడు బతికి ఉండి జీవితంలో బాగా హైట్స్‌లో ఉన్నవారు కూడా ఖచ్చితంగా ఓటమి, అవమానం పొంది ఉంటారు. మాటలు పడి ఉంటారు. తదుపరి గుండె చిక్కపట్టుకొని తమాయించుకొని ఎదిగారు.

**గమ్యం చేరేవరకు పోరాడాలి...**

జీవితంలో గెలిచాం కదా. ఇక ఆగిపోదాం అని ఉండదు. ఓటమి కదా ఇంక అంతా అయిపోయిందీ అనడానికి వీలు లేదు. ఈ రెండిటినీ పట్టుకొని అలా వెళ్ళిపోతూ ఉండాలి. గెలుపు ఇచ్చే ఆనందం కన్నా ఓటమి ఇచ్చే బాధ బలంగా ఉంటుంది. ఈ బాధ మనలను కుంగదీయకూడదు. మరింతగా ప్రేరేపించాలి. అప్పుడే ఓటమికి భయం ఉండదు. గెలిచినా ఓడినా మనం ఇక్కడే బతకాలి. గమ్యం చేరడానికి పోరాడాలి. ఈరోజు ఓటమి రేపటి గెలుపు అని గుర్తుంచుకోవాలి. గెలుపు నేర్వలేని ఎన్నో పాఠాలను ఓటమి నేర్పిస్తుంది. అందుకే మన పెద్దలు అంటారు జీవితంలో ఏది జరిగినా మన మంచికే అని.

క్రీడాకారుల జీవితాలు చూడండి. నిరంతరం గెలుపు ఓటములే. ఒక మ్యాచ్‌లో ఓడిపోతారు, మరో మ్యాచ్‌లో గెలుస్తారు. మళ్ళీ ఓడిపోతారు, మళ్ళీ గెలుస్తుంటారు. అందుకే జీవితంలో ఓడిన వారిని క్రీడా స్ఫూర్తిగా తీసుకోండి అంటారు. ఇటీవల ఒరిస్సా ఎన్నికల్లో ఓడిన మాజీ సి.ఎం. నవీన్ పట్నాయక్ 'ఎన్నికల్లో ఓడిపోయినంతమాత్రాన సిగ్గుపడాల్సిన పనిలేదు' అన్నారు. ఆయన ఏకధాటిగా 24సంవత్సరాలు ఒరిస్సాని పాలించారు. నాలుగు గంటల నీరెండకు కొండలు, బంగారు వర్ణాన్ని కప్పుకొని మెరుస్తుంటాయి. చీకటి పడగానే అవి కూడా చీకటిలో కలసిపోతాయి. మళ్ళీ రేపు నీరెండకు బంగారు వర్ణంతో మెరవడం మామూలే. కనుక ఇదిజీవితం. ఇలానే ఉంటుంది. మనం సిద్ధమయిపోవాలి.

**గెలుపు ఇచ్చే ఆనందం కన్నా ఓటమి ఇచ్చే బాధ బలంగా ఉంటుంది. ఈ బాధ మనలను కుంగదీయకూడదు. మరింతగా ప్రేరేపించాలి. అప్పుడే ఓటమికి భయం ఉండదు. గెలిచినా ఓడినా మనం ఇక్కడే బతకాలి. గమ్యం చేరడానికి పోరాడాలి. గెలుపు నేర్వలేని ఎన్నో పాఠాలను ఓటమి నేర్పిస్తుంది. ఈరోజు ఓటమి రేపటి గెలుపుకు నాంది అని గుర్తుంచుకోవాలి.**





హిస్టరీ రఫీ సార్,
అసిస్టెంట్ ప్రొఫెసర్
సెల్: 9848827238

## ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల్లో 10వేల ఉద్యోగాలు

ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల్లో దాదాపు 10వేల (9,995 పోస్టులు) ఉద్యోగ నియామకాలకు సంబంధించిన ఐబీపీఎస్ కామన్ రిక్రూట్‌మెంట్ ప్రాసెస్ ఫర్ రీజినల్ రూరల్ బ్యాంక్స్ నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నోటిఫికేషన్ ద్వారా గ్రూప్ ఏ ఆఫీసర్లయిన సీనియర్ మేనేజర్, మేనేజర్ వంటి అధికారుల నియామకంతో పాటు గ్రూప్ బీలో మల్టీపర్పస్ ఆఫీస్ అసిస్టెంట్ ఉద్యోగాలను భర్తీ చేస్తారు.

**ముఖ్య సమాచారం :**

**ఖాళీలు భర్తీ కానున్న బ్యాంకులు:** ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్, ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్, తెలంగాణ గ్రామీణ బ్యాంక్, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్, కర్ణాటక గ్రామీణ బ్యాంక్

**అర్హత:** ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు కంప్యూటర్ పరిజ్ఞానం కలిగి ఉండాలి.

**వయసు:** ఆఫీసర్ స్కేల్-3 (సీనియర్ మేనేజర్) పోస్టులకు 21 నుంచి 40 ఏళ్లు. ఆఫీసర్ స్కేల్-2 (మేనేజర్) పోస్టులకు 21 నుంచి 32 ఏళ్లు. ఆఫీసర్ స్కేల్-1 (అసిస్టెంట్ మేనేజర్) పోస్టులకు 18 నుంచి 30 ఏళ్లు. ఆఫీస్ అసిస్టెంట్ (మల్టీపర్పస్) పోస్టులకు 18 నుంచి 28 సంవత్సరాల మధ్య ఉండాలి.

**ఎంపిక ప్రక్రియ:** పోస్టును అనుసరించి ప్రిలిమ్స్ (రాత పరీక్ష), మెయిన్స్ (రాత పరీక్ష,) ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా తుది ఎంపిక ఉంటుంది.

**దరఖాస్తు ఫీజు :** స్కేల్ 1, స్కేల్ 2, స్కేల్ 3 ఆఫీసర్ ఉద్యోగాలకు, మల్టీ పర్పస్ అసిస్టెంట్ ఉద్యోగాలకు ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులైన అభ్యర్థులు రూ.175 చెల్లించాల్సి ఉంటుంది. మిగిలిన అభ్యర్థులు రూ.850 ఫీజు చెల్లించాలి.

**ముఖ్య తేదీలు :**

- దరఖాస్తుల ప్రారంభ తేదీ: జూన్ 7, 2024
- దరఖాస్తులకు చివరి తేదీ: జూన్ 27, 2024
- ప్రిలిమినరీ పరీక్ష : ఆగస్టు 3, 4, 10, 17,18
- మెయిన్ పరీక్ష తేదీ: 29.09.2024, 06.10.2024
- అభ్యర్థులు పూర్తి వివరాలకు https:// www. ibps.in% వెబ్‌సైట్ చూడొచ్చు.

### స్టేట్ బ్యాంక్‌లో 150 ఉద్యోగాలు

దేశంలోని అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 150ఉద్యోగాల భర్తీకై నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్ ద్వారా రెగ్యులర్ ప్రాతిపదికన 150 స్పెషలిస్ట్ క్యాడర్ ఆఫీసర్ ఖాళీల భర్తీ చేయనుంది. ఎలాంటి రాత పరీక్ష లేకుండా ఈ ఉద్యోగాలను భర్తీ చేస్తారు. పూర్తి వివరాలకు వెబ్‌సైట్ చూడండి.

**ముఖ్య సమాచారం :**

**పోస్టుల సంఖ్య**

ట్రేడ్ ఫైనాన్స్ ఆఫీసర్ మిడిల్ మేనేజ్‌మెంట్ గ్రేడ్-స్కేల్ II: 150 పోస్టులు

**అర్హతలు:** ఏదైనా విభాగంలో డిగ్రీ ఉత్తీర్ణత, ఐఐబీఎఫ్ ఫారెక్స్ సర్టిఫికేట్‌తో పాటు ట్రేడ్ ఫైనాన్స్ ప్రాసెసింగ్‌లో రెండేళ్ల పని అనుభవం ఉండాలి.

**వయోపరిమితి:** 31.12.2023 నాటికి 23 నుంచి 32 సంవత్సరాల మధ్య ఉండాలి.

**పే స్కేల్:** నెలకు రూ.48,170-రూ.69,810

**పోస్టింగ్ :** హైదరాబాద్, కోల్‌కతా

**దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.750 (ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు ఫీజు చెల్లింపు మినహాయింపు ఉంది).

**ఎంపిక విధానం:**

అప్లికేషన్ షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

**దరఖాస్తు విధానం :**

ఆన్‌లైన్ విధానంలో అప్లయ్ చేసుకోవాల్సి ఉంటుంది.

**ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభతేది:** జూన్ 7, 2024

**దరఖాస్తులకు చివరితేది:** జూన్ 27, 2024

తీర్పు 2024

# మళ్ళీ సంకీర్ణ శకం...

**ఈసారి 400 పైగా సీట్లతో తిరుగులేని మెజారిటీ సాధించాలనుకున్న బిజేపీ సాధారణ మెజారిటీ సైతం సాధించలేక, మిత్ర పక్షాల తోడ్పాటుతో మూడోసారి అధికారం కైవసం చేసుకుంది. నెహ్రూ తరువాత వరుసగా మూడోసారి ప్రధానమంత్రిగా అధికారం చేపట్టిన వ్యక్తిగా మోదీ రికార్డు సృష్టించారు. ప్రాంతీయ పార్టీలపై ఆధార పడవలసి రావటం వల్ల సమాఖ్య భావన పెరుగుతుంది. నిన్నటి వరకు ప్రాంతీయ పార్టీలను తన చెప్పుచేతల్లో ఉంచుకోవాలని భావించిన బిజేపీ తన ధోరణి మార్చుకొని ఇచ్చిపుచ్చుకునే విధంగా వ్యవహరించాల్సి ఉంటుంది.**

543 స్థానాలకు జరిగిన 18వలోక్‌సభ ఎన్నికల్లో 240 సీట్లు సాధించి అతి పెద్ద పార్టీగా అవతరించి, వరుసగా మూడోసారి అధికారం చేసపట్టినప్పటికీ బీజేపీకి ఆ సంతోషం కనిపించడం లేదు. మరోవైపు 99 సీట్లలో విజయం సాధించిన కాంగ్రెస్ ఇండియా కూటమిలోని మిత్రపక్షాలు అధికారం అంచుల దాకా వచ్చామన్న ఆనందంతో ఉండగా, ఎన్డీఏ మిత్ర పక్షాలు కేంద్రంలో కీలక పాత్ర పోషించ బోతున్నాయి. ప్రస్తుత ఫలితాలు కేంద్రంలో పదేళ్ల తర్వాత సంకీర్ణ ప్రభుత్వ ఏర్పాటుకు దోహదం చేశాయి.

మద్దతు ధర కోసం రోడ్డెక్కిన రైతుల పట్ల ఉదాసీనంగా వ్యవహరించడం, వారిని నిర్లక్ష్యంగా అణగదొక్కాలని చూడడం, పంజాబ్, హర్యానా, యూపీల లో బీజేపీకి ప్రతికూలంగా మారింది. అగ్నివీర్ పథకం యువతలో నిరాశ, నిస్పృహలతో బీజేపీపై ఆగ్రహం కలిగేందుకు కారణమైంది. చివరికి ప్రధాని మోదీ సైతం గతంలో కన్నా తక్కువ మెజారిటీ సాధించారు. 2019లో వారణాసిలో 4.79 లక్షల మెజారిటీ సాధించిన మోదీ ఇపుడు 1.52 లక్షల మెజారిటీ మాత్రమే సాధించారు. ప్రతిపక్ష ప్రభుత్వాలను కూల్చడం (మధ్యప్రదేశ్), శివసేనను చీల్చడం వంటి చర్యలతో బీజేపీకి మకిలి అంటింది. వికసిత భారత్‌పై పెద్దగా ప్రజలకు వివరించే ప్రయత్నం చేయలేదు. ప్రచారంలో మోదీ స్వయంగా విద్వేష వ్యాఖ్యలు చేసారు.

కర్ణుడి చావుకు అనేక కారణాలు అన్నట్టు బీజేపీ బలం తగ్గటానికి కూడా చాలా కారణాలు ఉన్నాయి.

**ప్రభుత్వ వ్యతిరేకత**

సాధారణంగా అధికారంలో ఎవరున్నా సరే.. ఆ పార్టీ ఎంత మంచి పాలన అందించినా సరే.. ఏదో లోపం ఉంటుంది. మరోవైపు ఓటర్లలోనూ ఆశలు, ఆకాంక్షలు నానాటికీ పెరుగుతూనే ఉంటాయి. ఓ సారి పాలన పూర్తయ్యే సరికే ప్రతి పార్టీ ఎంతో కొంత వ్యతిరేకతను మూటగట్టుకుంటుంది. అయితే భారతీయ జనతా పార్టీ 2014 కంటే 2019లో మరిన్ని ఎక్కువ సీట్లు సాధించి ఘన విజయం సాధించడంతో తమ పాలనపై సానుకూలత తప్ప వ్యతిరేకత లేదన్న భావన కలిగింది. నిజానికి 2019 ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ వంటి రాష్ట్రాల్లో ఖాతా కూడా తెరవకపోగా.. కేవలం హిందీ మాట్లాడే ఉత్తరాది రాష్ట్రాలతో పాటు గుజరాత్, మహారాష్ట్ర వంటి పశ్చిమ రాష్ట్రాల్లో స్వీప్ చేయడమే ఆ పార్టీకి నాడు అంత బలాన్ని ఇచ్చింది. ఈసారి ఎన్నికలకు ముందు ఉత్తరాదిలో ప్రభుత్వ వ్యతిరేకత తీవ్రత అంచనా వేయలేకపోయారు.

**రిజర్వేషన్లను ఎత్తేస్తారని ప్రచారం**

'అబ్‌కీ బార్ 400 పార్' అంటూ ఆత్మవిశ్వాసంతో ఉన్న బీజేపీకి.. అదే ఆంశంతో విపక్షాలుచెక్ పెట్టాయి. ఒకవేళ బీజేపీ కూటమికి గనక 400 సీట్లు వస్తే.. భారత రాజ్యాంగాన్నే మారుస్తారంటూ ప్రచారం మొదలు పెట్టారు. మరోసారి అధికారంలోకి వస్తే రిజర్వేషన్లనీ ఎత్తేస్తారని గట్టిగానే ప్రచారం చేశారు. ఇది బాగా ప్రభావితం అయింది. ప్రధాని మోదీ-అమిత్ షా దీనిపై వివరణ ఇచ్చారు. తాము అధికారంలోకి వస్తే.. రాజ్యాంగాన్ని మార్చడం గానీ, రిజర్వేషన్లు ఎత్తేయడం గానీ ఉండబోదని చెప్పారు. కానీ అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. మరోవైపు, బీజేపీ ప్రచారాన్ని కూడా రాహుల్‌గాంధీ ధీటుగానే ఎదుర్కొన్నారు. ఫలితంగా 2019లో యూపీలో 62 స్థానాలు గెలుచు కున్న బీజేపీ.. ఈసారి కేవలం 33 స్థానాలకు పరిమితమైంది.

**అంతర్జాతీయ పరిణామాల ప్రభావం**

గత పదేళ్లుగా అనేక సంఘటనలతో ప్రపంచం అతలాకుతలమైంది. కోవిడ్-19 మహమ్మారి, ఉక్రె యిన్- రష్యా దేశాల మధ్య సుదీర్ఘకాలంగా సాగుతున్న యుద్ధం, తాజాగా పాలస్తీనా ఇజ్రాయిల్ మధ్య నెలకున్న యుద్ధం, ఆర్థిక మందగమనం వంటి అంతర్జాతీయ పరిణామాల ప్రభావం యావత్ ప్రపంచంపై ఉంది. అనేక అభివృద్ధి చెందిన దేశాల్లో ఆర్థిక వ్యవస్థలు అతలాకుతలమైన సమయంలోనూ భారత ఆర్థిక వ్యవస్థ స్థిరంగా ముందుకు సాగింది. కానీ ఈ క్రమంలో నిరుద్యోగం, ధరల పెరుగుదల పెరిగాయి. ప్రభుత్వం సబ్సిడీల భారాన్ని తగ్గించుకోవడంతో పెట్రోల్, గ్యాస్, చివరకు రైళ్లలో వృద్ధులకు ఇస్తున్న రాయితీలు, సబ్సిడీలు కూడా మాయమయ్యాయి. ఫలితంగా ప్రభుత్వ వ్యతిరేకత పెరిగింది.

కూటమి పొత్తులతో సంబంధం లేకుండా విడిగా పోటీ చేసినా మంచి ఫలితాలు సాధించటంతో కూటమి బలం పెరిగింది.

**ప్రభావం చూపని అయోధ్య రామాలయ అంశం**

అయోధ్య రామాలయం. హిందువుల చిరకాల వాంఛ. దాన్ని నిజం చేసినందుకు హిందువులంతా ఏకమై తమకు ఓటేస్తారని భావించిన చోటే బీజేపీకి ఎదురు దెబ్బ తగిలింది. అయోధ్య పట్టణం ఉన్న ఫైజా బాద్ నియోజకవర్గంలోనే బీజేపీ ఓటమి పాలైంది. జనవరిలో మందిరం ప్రారంభించినప్పుడు దేశమంతటా ఏర్పడ్డ భావోద్వేగ వాతావరణం మే నెల నాటికి చాలా వరకు చల్లారింది. ఆలయ నిర్మాణం కారణంగా ముస్లిం ఓట్లు ప్రతిపక్షాలకు గంపగుత్తగా పడ్డాయి. కానీ హిందు వుల ఓట్లు కులాలవారీగా చీలిపోయాయి. ఫలితంగా అయోధ్య రామాలయం నిర్మించిన ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రంలోనే బీజేపీకి కోలుకోలేనంత గట్టి దెబ్బ తగిలింది.

**దక్షిణాదిన వికసించని కమలం**



దక్షిణాదిన బీజేపీ గతం కంటే ఓట్ల శాతం మెరుగు పరుచుకున్నా సీట్ల సంఖ్య విషయంలో నిరాశే ఎదురైంది. ఏపీలో మిత్ర పక్షాలతో కలిసి 6 చోట్ల పోటీ చేసి 3 గెలుచుకుంది. తమిళనాడులో ఓట్లశాతం పెరిగినప్పటికీ అది సీట్లు గెలుపించేంతగా లేకపోయింది. కేరళలో ఖాతా తెరిచి ఒక స్థానాన్ని గెలుపొందగలిగింది. కర్ణాటకలో జేడీ(ఎస్)తో కలిసి పోటీ చేసి పరవాలేదనిపించింది. అయినప్పటికీ 2019తో పోల్చితే స్థానాలు తగ్గాయి. తెలంగాణలో మాత్రమే 35% ఓట్లు సాధించి, 8 స్థానాల్లో గెలుపొంది సరికొత్త రికార్డు సృష్టించింది.

**బెంగాల్‌లో సీఏఏ**

మొత్తం 42 లోక్‌సభ సీట్లున్న పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో 2019లో 18 సీట్లు గెలుపొందిన బీజేపీ, ఈ సారి 20 దాటి గెలుచుకుంటామని భావించింది. కానీ చివరకు 12సీట్లకే పరిమితం కావాల్సి వచ్చింది. బెంగాల్ ఫలితాలను తీవ్రంగా ప్రభావితం అంశం పౌరసత్వ సవరణ చట్టం. అఫ్ఘనిస్తాన్, బంగ్లాదేశ్, పాకిస్తాన్ దేశాల్లో మతపరమైన హింసకు గురై భారత్‌కు వలసవచ్చిన ముస్లిమేతర మతాలకు చెందినవారికి భారత పౌరసత్వం కల్పించి పూర్తి హక్కులు కల్పించడమే ఈ చట్టం ముఖ్యోద్దేశం. కానీ ఓటుబ్యాంకు రాజకీయాలతో లబ్ది పొందాలనుకున్న విపక్షపార్టీలు నానా రాద్ధాంతం చేశాయి. బెంగాల్‌లో బంగ్లాదేశ్ నుంచి వలస వచ్చినవారి సంఖ్య గణనీయంగా ఉంది. వారిలో ముస్లిమేతరులు సీఏఏ కోసం దరఖాస్తు చేసుకుని పూర్తి హక్కులు పొందవచ్చు. కానీ తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమత బెనర్జీ ఈ చట్టాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ వచ్చారు. "ఈ చట్టం ద్వారా పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకుంటే.. మీ అంతట మీరు బంగ్లాదేశీ శరణార్థిగా చెప్పుకున్నట్టు అవుతుంది. మీకు ఇప్పటికే అందుతున్న ప్రభుత్వ ప్రయోజనాలు అన్నీ ఆగిపోతాయి" అంటూ మమత చేసిన ప్రసంగాలు ప్రజల్లోకి చొచ్చుకెళ్లాయి. ఫలితంగా బీజేపీకి పడాల్సిన హిందూ ఓట్లకు కూడా గండి పడింది.

**విపక్ష కూటమి పార్టీల పోరాటం...**

బీజేపీ ఓటమి, మోదీని గద్దె దించడమే ఏకైక లక్ష్యంగా చేతులు కలిపిన విపక్ష కూటమి పార్టీలలో తొలుత ఐక్యత లేకపోయినా తమ రాష్ట్రాల్లో చాలా వరకు ప్రభావం చూపాయి. బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్, పంజాబ్‌లో ఆమ్ ఆద్మీ పార్టీ, కేరళలో కమ్యూనిస్టులు

**స్థానిక నేతలను విస్మరించటం...రెబల్స్ ప్రభావం..**

ప్రభుత్వ వ్యతిరేకతను తప్పించుకోవడం కోసం మూడో వంతుకు పైగా సిట్టింగ్ అభ్యర్థులను మార్చుతూ చేసిన ప్రయోగం బెడిసికొట్టింది. ఈ క్రమంలో పార్టీ నేతలకు కాకుండా గెలుపు గుర్రాలు అనుకుంటూ ఇతర పార్టీల నుంచి వచ్చి చేరినవారికి పార్టీ టికెట్లు ఇచ్చింది. పార్టీలో సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న కార్యకర్తలకు ఈ చర్య ఆగ్రహం తెప్పించింది. మరోవైపు టికెట్ దక్కించుకోలేకపోయిన సిట్టింగ్ ఎంపీలు కొందరు స్వతంత్రంగా బరిలోకి దిగితే, మరికొందరు ఇతర పార్టీల్లో చేరి పోటీ చేశారు.

ఫలితంగా ఓట్లు చీలి అనేక చోట్ల పార్టీ ఓటమికి కారణమయ్యాయి.యూపీ, రాజస్థాన్ రాష్ట్రాల్లో రాజకీయాల్లో ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తున్న క్షత్రియ సామాజిక వర్గాన్ని బీజేపీ పక్కనపెట్టిందన్న భావన కలిగి క్షత్రియులు బీజేపీపై ఆగ్రహంతో ఆ పార్టీ ఓటుబ్యాంకును చీల్చారు. ఇలా అనేక కారణాలు కలిసి బీజేపీ ఆధిపత్యానికి బ్రేకులు వేయగా పదేళ్ల తర్వాత తొలి సారిగా అసలు సిసలు సంకీర్ణ ప్రభుత్వ ఏర్పాటుకు బాటలు వేశాయి.

**రాహుల్ భారత్ జోడో, న్యాయ్ యాత్రలు..**

రాహుల్ తమిళనాడు నుంచి కశ్మీర్ వరకు పాద యాత్ర చేశారు. జోడో యాత్ర కొనసాగుతున్నప్పుడే కర్నాటకలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. ఇది రాహుల్ సాధించిన తొలి విజయం. ఆ తరువాత పార్టీ ఉనికే లేదనుకున్న తెలంగాణలో ఏకంగా అధికారం చేపట్టింది. అలా ఒక్కొక్కటిగా రాహుల్ యాత్రతో పాటు కాంగ్రెస్ పార్టీ జైత్రయాత్ర కొనసాగింది. బిజేపీ రాహుల్‌ను తక్కువగా అంచనా వేయటం మరో లోపం.

**1 శాతం ఓట్లు .....63 సీట్లు**

2019లో 303 సీట్లు సాధించిన బిజెపి ఈసారి 240 సీట్లు మాత్రమే సాధించింది. అంటే గతంలో కన్నా 63 సీట్లు తగ్గాయి. అయితే ఓట్లపరంగా చూస్తే ఈ తేడా చాలా స్వల్పంగా ఉన్నది. 2019 ఎన్నికల్లో బీజేపీ 37.7 శాతం ఓట్లు పొందగా, ఈసారి 36.56 శాతం ఓట్లు సాధించింది. అంటే కేవలం 1.20 శాతం ఓట్లు మాత్రమే తగ్గాయి.

**మళ్లీ సంకీర్ణ ప్రభుత్వ శకం**

దేశంలో మళ్లీ సంకీర్ణ ప్రభుత్వ శకం మొదలైంది. పదేళ్ల కిందటి రాజకీయ పరిస్థితులు మళ్లీ పునరావృత మయ్యాయి. వాస్తవానికి 2014, 2019లో ఎన్డీఏ కూటమిగా అధికారంలోకి వచ్చినప్పటికీ ఒంటరిగానే అధికారం చేపట్టడానికి అవసరమైన సీట్లను బీజేపీ దక్కించుకుంది. పేరుకు ఎన్డీయేగా అధికారంలో ఉన్నా బీజేపీకి ఇతర పార్టీలపై ఆధారపడాల్సిన అవసరం లేదు. ఐతే ఇపుడు బీజేపీ మ్యాజిక్ ఫిగర్‌కు 31 సీట్ల దూరంలో 241 వద్దనే నిలిచిపోయింది. దీంతో అధికారంలోకి రావడానికి, తన ప్రభుత్వాన్ని కాపాడుకునేందుకు ప్రాంతీయ పార్టీలపై బీజేపీ ఆధారపడాల్సిన పరిస్తితి ఉంది. సంకీర్ణ ప్రభుత్వాలు మనకి కొత్తేం కాదు. 1951లో మొదటి ఎన్నికలు జరిగినప్పటి నుంచి ఇప్పటి వరకు 73 ఏళ్లలో 32 ఏళ్ల పాటు దేశంలో పార్టీలు కూటమిగా ఏర్పడిన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. 1977లో ఎమర్జెన్సీ ముగిసిన తర్వాత భారతీయ జనసంఘ్ నేతృత్వంలో 11పార్టీలు కలిపి జనతా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. ఈ ప్రభుత్వం 1979 వరకు కొనసాగింది. ఆ తర్వాత కాంగ్రెస్ మద్దతుతో చరణ్ సింగ్ ప్రధాని అయ్యారు. 2014లో బీజేపీ అధికారంలోకి రాకముందు కూడా 2004 నుంచి 2014 రెండుసార్లు కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలో సంకీర్ణ ప్రభుత్వమే దేశాన్ని పాలించింది. 2014లో 282 సీట్లతో, 2019లో 303 సీట్లతో మోదీ సారథ్యంలో ఇతర పార్టీల మద్దతుతో పనిలేకుండా బీజేపీ అధికారం చేపట్టింది.

**సమాఖ్య భావన పెరుగుతుంది....**

ప్రస్తుతం బీజేపీ ప్రాంతీయ పార్టీలపై ఆధార పడవలసి రావటం వల్ల సమాఖ్య భావన పెరుగుతుందని రాష్ట్రాల ప్రాతినిధ్యం పెరుగుతుందని బీజేపీ ఏకపక్ష నిర్ణయాలకు చెక్ పెట్టవచ్చని భావించవచ్చు. నిన్నటి వరకు ప్రాంతీయ పార్టీలను తన చెప్పుచేతల్లో ఉంచుకోవాలని భావించిన బిజేపీ తన ధోరణి మార్చుకొని ఇచ్చిపుచ్చుకునే విధంగా వ్యవహరించాల్సి ఉంటుంది. తనను కూటమి నేతగా ఎన్నుకున్న వెంటనే మోదీ ఇకపై ప్రభుత్వ నిర్ణయాలు ఉమ్మడిగా కలిసి తీసుకుంటామని ప్రకటించారు.

**ఏ.పి.కి ఇది సువర్ణ అవకాశం.**

ముఖ్యంగా ఏ.పి.కి ఇది సువర్ణ అవకాశం. విభజన సమస్యల పరిష్కారం, పోలవరం ప్రాజెక్టు పూర్తి, అమరావతి నిర్మాణాలకు కేంద్రం వెన్నుదన్నుగా ఉండవచ్చు. ఏ.పి.కి దక్కిన ఈ సువర్ణ అవకాశాన్ని చంద్రబాబు సద్వినియోగం చేసుకొని ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి బాటలు వేస్తారని ఆశిద్దాం.



- డా॥ వి.సతీష్

# తీర్పు 2024

# పార్లమెంట్ ఎన్నికలు-ప్రధానాంశాలు

ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌లో ఎన్నికల క్రతువు ముగిసింది. దేశంలోని మొత్తం 543 లోక్‌సభ స్థానాలకు మొత్తం 7 దశలలో ఎన్నికలు జరిగాయి. అధికార బీజేపీ కూటమి 292 సీట్లు, కాంగ్రెస్ నేతృత్వంలో ఇండియా కూటమి 234 సీట్లు సాధించగా మిగిలిన పార్టీలు 17 సీట్లు సాధించాయి. 2014, 2019 ఎన్నికల్లో గెలిచిన బీజేపీ ఈ సారి మళ్లీ అధికారంతో హ్యాట్రిక్ సాధించింది. ఎన్నికల ప్రక్రియలో ముఖ్య వివరాలు తెలుసుకుందాం..

- లోక్‌సభ ఎన్నికలు ముగియడంతో సీఈసీ రాజీవ్ కుమార్, ఇద్దరు ఎన్నికల కమిషనర్లు రాష్ట్రపతిని కలిసి 18వ లోక్‌సభకు ఎన్నికైన ఎంపీల వివరాలను సమర్పించారు.
- లోక్‌సభ ఎన్నికలు మొత్తం 7 దశలలో జరిగాయి. తొలి ఆరు దశలలో వరుసగా 66.14, 66.71, 65.68, 69.16, 62.2, 63.36 శాతాల పోలింగ్ నమోదైంది. ఏడవ దశలో 62 శాతం పోలింగ్ నమోదైంది.
- ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో కేంద్ర మంత్రివర్గం సమావేశమై.. జూన్ 16 వరకు గడువు ఉన్న ఈ లోక్‌సభను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకొని రాష్ట్రపతికి సిఫార్సు చేసింది. ఈ సిఫార్సుకు రాష్ట్రపతి ఆమోదం తెలపడంతో 17వ లోక్‌సభ రద్దయ్యింది.

**ఎంపీలపై క్రిమినల్ కేసులు**

- లోక్‌సభ ఎన్నికల్లో ఎన్నికైన 543 మంది ఎంపీల్లో.. సుమారు 46 శాతం మందిపై అంటే దాదాపు 251 మంది ఎంపీలపై క్రిమినల్ కేసులు నమోదు అయి ఉన్నాయి. దీంట్లో 27 మంది దోషులుగా ఉన్నారని. అసోసియేషన్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్(ఏడీఆర్) సంస్థ తెలిపింది. 2014లో 185 మంది, 2004లో 125 మంది, 2009లో 162 మంది, తమపై క్రిమినల్ కేసులు ఉన్నట్లు వెల్లడించారు. బీజేపీ పార్టీలో 94 మందిపై క్రిమినల్ కేసులు ఉన్నాయి. 99 సీట్లు గెలిచిన కాంగ్రెస్‌లో 49 శాతం మందిపై క్రిమినల్ కేసులు ఉన్నట్లు ఏడీఆర్ తెలిపింది. 37 సీట్లు గెలిచిన ఎస్పీలో 21 మందిపై క్రిమినల్ ఆరోపణలు ఉన్నాయి.

**తొలిసారి 280 మంది ఎంపీలుగా ఎన్నిక**

- 2024 ఎన్నికల్లో తొలిసారి 280 మంది ఎంపీలుగా ఎన్నికయ్యారు. 2019లో ఆ సంఖ్య 267గా ఉంది.

**స్వతంత్ర అభ్యర్థుల ప్రాబల్యం తగ్గుతోంది**

- పార్లమెంట్‌లో స్వతంత్ర అభ్యర్థుల ప్రాబల్యం ఏడాదికేడాది తగ్గుతూ వస్తోంది. ఈ ఎన్నికల్లో కేవలం ఏడుగురు మాత్రమే గెలిచారు.

**78 మంది మహిళా అభ్యర్థులు...**

- 2024 లోక్‌సభ ఎన్నికల్లో 797 మంది మహిళలు పోటీ చేశారు. 73 మంది గెలుపొందారు. 2019లో 78 మంది మహిళా అభ్యర్థులు గెలు పొందారు.

**ఎక్కువ మెజారిటి**

- ఇండోర్‌లో శంకర్‌లల్వానికి 11.75 లక్షల ఓట్లు మెజారిటీ లభించింది.
- అసోంలో ధుబ్రి నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి రకిబుల్ హుస్సేన్ 10.12 లక్షల ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.

**తక్కువ మెజారిటి**

- మహారాష్ట్రలోని ముంబయి నార్త్‌వెస్ట్ లోక్‌సభ స్థానం నుంచి 48 ఓట్ల తేడాతో ఏక్‌నాథ్ షిండే వర్గానికి



చెందిన రవీంద్ర దత్తారామ్ విజయం సాధించారు.

**93శాతం మంది కోటీశ్వరులే....**


- సార్వత్రిక ఎన్నికల్లో గెలిచిన అభ్యర్థుల్లో 93శాతం మంది కోటీశ్వరులేనని 'అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫామ్స్' (ఏడీఆర్) తెలిపింది. గత ఎంపీల్లో 475 మంది మిలియనీర్లు ఉండగా, వీరి సంఖ్య ఈసారి 504కు పెరిగిందని వెల్లడించింది. ధనిక ఎంపీల్లో గుంటూరు టీడీపీ అభ్యర్థి చంద్రశేఖర్ పెమ్మసాని రూ.5,705 కోట్లతో మొదటి స్థానంలో ఉండగా, చేవెళ్ల బీజేపీ అభ్యర్థి విశ్వేశ్వర్‌రెడ్డి రూ.4,568 కోట్ల ఆస్తులతో రెండో స్థానంలో ఉన్నారని తెలిపింది.

**ఓట్ల శాతం-సీట్ల సంఖ్య మధ్య తేడా...**

- తాజా లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ సొంతంగా ప్రభుత్వం ఏర్పాటుచేసే స్థాయిలో సీట్లను సాధించలేకపోయింది. 2019లో 303 సీట్లు సాధించిన ఈ పార్టీ ఈసారి 240 సీట్ల వద్దనే ఆగిపోయింది. అంటే గతంలో కన్నా 63 సీట్లు తగ్గాయి. అయితే ఓట్లపరంగా చూస్తే ఈ తేడా చాలా స్వల్పంగా ఉన్నది. 2019 ఎన్నికల్లో బీజేపీ 37.7 శాతం ఓట్లు పొందగా, ఈసారి 36.56 శాతం ఓట్లు సాధించింది. అంటే కేవలం 1.20 శాతం ఓట్లు మాత్రమే తగ్గాయి.
- దక్షిణాదిన ఆ పార్టీ ఓటింగ్ శాతాన్ని పెంచుకున్నప్పటికీ ఆశించిన స్థాయిలో సీట్లు పెరగలేదు. ఉదాహరణకు తమిళనాడులో ఓట్ల శాతం 10 శాతానికి పెరిగినా, ఒక్క సీటు కూడా గెలవలేకపోయింది.

**ఇద్దరు నేరస్తులు జైలు నుంచీ గెలుపు...**

- జమ్మూ కశ్మీర్‌లోని బారాముల్లా నుంచి ఉగ్ర నిధుల కేసు నిందితుడు ఇంజినీర్ రషీద్ లోక్‌సభ ఎన్నికల్లో గెలుపొందాడు. జమ్ము కశ్మీర్‌లో నేషనల్ కాన్ఫరెన్స్ నాయకుడు ఒమర్ అబ్దుల్లాపై 2లక్షల 41వేల 42ఓట్ల మెజార్టీతో జయకేతనం ఎగరేశాడు. జమ్మూ కాశ్మీర్‌లో ఉగ్ర కార్యకలాపాలకు నిధులు సమకూర్చారన్న అభియోగాలపై 2019 ఆగస్టులో రషీద్‌ను అరెస్ట్ చేశారు. తాజా ఎన్నికల్లో బారాముల్లా స్థానం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి ఏకంగా మాజీ సీఎంనే ఓడించాడు.




- పంజాబ్‌లోలోని ఖదూర్ సాహిబ్ లోక్‌సభ స్థానం నుంచి వేర్పాటువాది అమృతపాల్ సింగ్ గెలుపొందారు. ప్రస్తుతం అసోంలోని దిబ్రూగఢ్ జైలులో ఉన్న ఆయన స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగారు. కాంగ్రెస్ అభ్యర్థి కుల్బీర్ సింగ్ జీరాపై లక్షా 97వేల 120ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. అమృత్‌సర్ జిల్లా అజ్‌నాలా పోలీసులపై దాడి కేసులో 'వారిస్ పంజాబ్ దే' నాయకుడు, వేర్పాటువాది అమృత్‌పాల్ పేరు దేశవ్యాప్తంగా మార్మోగింది. జాతీయ భద్రతా చట్టం కింద 2023 ఏప్రిల్‌లో పోలీసులు ఆయన్ను అరెస్టు చేశారు. అప్పటి నుంచి అస్సాంలోని దిబ్రూగఢ్ జైల్లో శిక్ష అనుభవిస్తున్నారు.

**25 సంవత్సరాలకే గెలుపు...**

- బీహార్‌లోని సమస్తీపూర్ నియోజకవర్గం నుండి శాంభవి చౌదరి లోక్‌జనశక్తి పార్టీ నుండి 25 సంవత్సరాలకే లోక్‌సభకు ఎన్నికయ్యారు.


**నోటాకు రెండు లక్షల ఓట్లు...**

- మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ లోక్‌సభ నియోజకవర్గంలో నోటాకు 2,18,674 ఓట్లు పోలయ్యాయి.

**అంచనా తప్పిన ఎగ్జిట్ పోల్స్**

- దేశవ్యాప్తంగా ఎగ్జిట్ పోల్స్ అన్నీ ఎన్డీయేకే అధికారం దక్కుతుందని, బీజేపీ కూటమి 350కిపైగా స్థానాల్లో విజయం సాధించి మళ్లీ మూడోసారి అధికారం చేపడతుందని జోస్యం చెప్పాయి. బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్‌ను మించి బీజేపీ సీట్లు గెల్చుకుంటుందని, ఉత్తర్‌ప్రదేశ్, గుజరాత్, మధ్యప్రదేశ్‌లో బీజేపీ తన ఆధిపత్యాన్ని నిరూపించుకుంటుందని చెప్పిన జోస్యాలు అంచనా తప్పాయి.

జూన్ 9న ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించిన ప్రమాణ స్వీకార మహోత్సవంలో ప్రధాన మంత్రితోపాటు 71 మంది కేంద్ర మంత్రులుగా ప్రమాణం చేశారు. వీరిలో తెలుగు రాష్ట్రాల నుంచి ఐదుగురికి చోటు దక్కింది. తెలంగాణ నుంచి జి. కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్ (కరీంనగర్ ఎంపీ), ఆంధ్రప్రదేశ్ నుంచి కింజరపు రాంమోహన్ నాయుడు, పెమ్మసాని చంద్ర శేఖర్ (తెలుగుదేశం), బీజేపీ నరసాపురం ఎంపీ భూపతిరాజు శ్రీనివాస వర్మ కేంద్ర మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు.




## ఆంధ్రప్రదేశ్‌లో ఏకపక్ష తీర్పు...

- ఆంధ్రప్రదేశ్‌లో ప్రజలు ఏకపక్షంగా తీర్పు ఇచ్చారు. తెలుగుదేశం బీజేపి, జనసేన కూటమి క్లీన్‌స్వీప్ చేసింది. 2019లో 151 స్థానాలతో అఖండ విజయం సాధించిన వైసిపి 11 స్థానాలకు పరిమితమైంది. బహుశ విపక్ష కూటమి సైతం తాము ఇంత భారీ మెజారిటీతో గెలుస్తామని ఊహించి ఉండకపోవచ్చు.
- నాయకత్వ నియంతృత్వ పోకడలు, నిరుద్యోగం, ధరల పెరుగుదల, ప్రభుత్వం పట్ల వ్యతిరేకత, ఈ వ్యతిరేక ఓటు చీలకుండా ప్రతిపక్షాలు కూటమిగా ఏర్పడడం, చంద్రబాబు ఈ ఎన్నికలను జీవన్మరణ సమస్యగా తీసుకొని పోరాడటం, ప్రభుత్వోద్యోగులలో వ్యతిరేకత తదితర కారణాలు ఈ ఫలితాలను ప్రభావితం చేసాయని చెప్పవచ్చు.
- కేవలం సంక్షేమ పథకాలే ఓట్లు రాల్చవని గతంలో తెలంగాణ ఎన్నికల ఫలితాలు చెపితే, ఏ.పి.లో అదే సంగతి మరోమారు నిరూపితమైంది.
- కేసరపల్లి ఐటీ పార్క్ వద్ద జూన్ 12, ఉదయం 11 గంటల 27 నిమిషాలకు చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

**ఏపీ ఎన్నికల ఫలితాలు**

| పార్టీ | సంవత్సరం - సీట్లు 2024 | 2019 |
|---|---|---|
| టి.డి.పి | 135 | 23 |
| జనసేన | 21 | 1 |
| బిజెపి | 8 | 0 |
| వైసిపి | 11 | 151 |



# ఎకానమి

## APPSC, TSPSC గ్రూప్-1, 2 JL, DL

# General Agreement on Tariffs and Trade (GATT)

**సుంకాలు మరియు వ్యాపారంపై సాధారణ ఒప్పందం (గాట్)**

**GATT అంటే ఏమిటి? :**

GATT అనగా టారిఫ్‌లు మరియు వాణిజ్యంపై సాధారణ ఒప్పందం. అంతర్జాతీయ వాణిజ్యాన్ని నియంత్రించడానికి తాత్కాలిక ఒప్పందంగా 1947లో రూపొందించబడింది.

**GATT ఎందుకు సృష్టించబడినది? :**

ప్రపంచ వాణిజ్యాన్ని నియంత్రించడానికి GATT జనవరి 1, 1948 నుండి తన విధులను నిర్వహిస్తోంది. రెండవ ప్రపంచయుద్ధం తర్వాత వాణిజ్య సుంకాలు, కోటాలు మరియు సబ్సిడీలను తగ్గించడం లేదా తొలగించడం ద్వారా ఆర్థిక పునరుద్ధరణను పెంచడానికి ఇది సృష్టించబడింది.

**GATT చరిత్ర :**

ప్రపంచంలో 1930దశకంలో ఏర్పడిన మహా మాంద్యం సమయంలో అనేక దేశాల్లో అంతర్జాతీయ వ్యాపారం ప్రతికూల ప్రభావాన్ని చూపింది. ఆయా దేశాల ఆర్థిక వ్యవస్థల రక్షణకోసం రకరకాల దిగుమతి సుంకాలను విధించారు. ఫలితంగా అంతర్జాతీయ వ్యాపారం వేగంగా తగ్గింది.

మొదటి, రెండవ ప్రపంచ యుద్ధాలు ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థలను చిన్నాభిన్నం చేసాయి. ఈ పరిస్థితిని చక్కదిద్ది ప్రపంచ దేశాల మధ్య సరళీకరణతో కూడుకున్న ప్రపంచ వ్యాపారం ఉండాలని అంతర్జాతీయ వర్తకానికి సుహృద్భావ వాతావరణం నెలకొల్పాలని అగ్రదేశాలు తలచాయి. 1944లో బ్రెటెన్ ఉడ్స్‌లో జరిగిన సమా వేశం ఇందుకు తార్కాణం. ఈ ఆశయ సాధన కోసం ఐఎమ్ఎఫ్, ఐబిఆర్‌డి, ఐటిఓ వంటి సంస్థలను నెలకొల్పారు. ఐఎమ్ఎఫ్ మరియు ఐబిఆర్‌డి సంస్థల స్థాపన బ్రెటన్ ఉడ్స్‌లో జరగడం వలన ఈ రెండు సంస్థలను బ్రెటన్ వుడ్స్ కవలలు అంటారు.

1947-48 మధ్య కాలంలో క్యూబాలోని హవానా నగరంలో జరిగిన యునైటెడ్ నేషన్స్ కాన్ఫరెన్స్ ఆన్ ట్రేడ్ & ఎంప్లాయ్‌మెంట్‌లో GATT మొదటిసారిగా చర్చించబడింది. అక్కడే అంతర్జాతీయ వాణిజ్యసంస్థ(ఐటిఓ)ను సృష్టించే ఆలోచన ప్రతిపాదించబడినది.

ఐటిఓను ఏర్పాటు చేసి 53 దేశాలు ఒప్పందంపై సంతకాలు చేసాయి. కానీ అమెరికా హవానా చార్టర్‌ను ఒప్పుకోలేదు. ఫలితంగా ఐటిఓ అమలులోనికి రాలేదు. అదే సమయంలో జెనీవాలో 1947, అక్టోబరు 30న 23 దేశాలు సుంకాలకి, వ్యాపార రాయితీలకి సంబంధించిన ఒప్పందంపై సంతకాలు చేసాయి. ఫలితంగా సుంకాలు, వ్యాపారంపై సాధారణ ఒప్పందం GATT ఏర్పడింది. జనవరి 1, 1948 నుండి డిసెంబర్ 31, 1994 వరకు అమలు చేయబడింది. జనవరి 1, 1995 నుండి గాట్ స్థానంలో ప్రపంచ వాణిజ్య సంస్థ డబ్ల్యుటిఓ ఏర్పడింది. GATT అనేది అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందం. ఇది 1947లో భారత్‌తో సహా 23 దేశాలచే సంతకం చేయ బడింది మరియు జనవరి 1, 1948 నుండి అమలులోకి వచ్చింది. ఇది 8రౌండ్ల చర్చల ద్వారా శుద్ధి చేయబడింది. చివరకు ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటిఓ) ఏర్పాటుకు దారితీసింది. డబ్ల్యుటిఓ జనవరి 1, 1995న GATT స్థానంలో ఏర్పడింది.

GATT వస్తువుల వ్యాపారంపై దృష్టి సారించింది. సభ్యదేశాల మధ్య సుంకాలను తగ్గించడం మరియు కోటాలను తొలగించడం ద్వారా వాణిజ్యాన్ని సరళీ కరించడం దీని లక్ష్యం.

GATT ద్వారా జరిపిన వివిధ చర్చల ఫలితంగా పారిశ్రామిక వస్తువులపై సగటు సుంకాలను 40% నుండి (1947) 5% (1993)కి తగ్గించడం జరిగింది. ఇది ఆర్థిక ప్రపంచీకరణకు తొలి అడుగు.

GATT అనేది పశ్చిమ సైనిక కూటమి అయిన నార్త్ అట్లాంటిక్ ట్రీటీ ఆర్గనైజేషన్(నాటో) కంటే ఒక సంవత్సరం ముందే స్థాపించబడినది. రెండవ ప్రపంచయుద్ధం తర్వాత కొద్ది కాలానికే ప్రారంభమైన ప్రచ్ఛన్నయుద్ధంలో GATT ముఖ్యమైన పాత్ర పోషించింది.

బహుపాక్షిక ఒప్పందాల ద్వారా వాణిజ్యాన్ని సరళీ కరించడం ద్వారా యుఎస్ నేతృత్వంలోని పెట్టుబడిదారీ పశ్చిమ దేశాలకు తన ప్రభావాన్ని విస్తరించడానికి ఇది సహాయపడింది.

**GATT సభ్యులు :**

GATT అమలులోకి రాకముందే 1947లో జెనీవా లో 23 దేశాలు సంతకం చేసాయి. వాటి వివరాలు కింది విధంగా ఉన్నాయి.

1. ఆస్ట్రేలియా
2. బెల్జియం
3. బ్రెజిల్
4. బర్మా
5. కెనడా
6. సిలోన్ (శ్రీలంక)
7. చిలి
8. చైనా
9. క్యూబా
10. చెకోస్లోవేకియా
11. ఫ్రాన్స్
12. భారతదేశం
13. లెబనాన్
14. లక్సెంబర్గ్
15. నెదర్లాండ్స్
16. న్యూజిలాండ్
17. నార్వే
18. పాకిస్తాన్
19. దక్షిణ రొడేషియా
20. సిరియా
21. దక్షిణ ఆఫ్రికా
22. యునైటెడ్ కింగ్‌డమ్
23. అమెరికా సంయుక్త రాష్ట్రాలు

గాట్‌పై సంతకం చేసిన ప్రభుత్వాలను అధికారికంగా గాట్ కాంట్రాక్ట్ పార్టీలు అని పిలుస్తారు. 1994నాటికి 128 దేశాలు గాట్‌పై సంతకాలు చేసాయి. గాట్ ప్రధాన కార్యాలయం స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో ఉంది. గాట్‌నే రిచ్‌మెన్ క్లబ్ అని కూడా పిలుస్తారు.

**GATT సమావేశాలు :**

1947 నుండి 1993 వరకు ఎనిమిదిసార్లు గాట్ సమావేశాలు నిర్వహించబడ్డాయి. ఈ సమావేశాల వివరాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి.

1. మొదటిరౌండ్ 1947 జెనీవాలో జరిగింది. 23 దేశాలు పాల్గొన్నాయి. GATT స్థాపనకు దారితీసిన రౌండే మొదటి రౌండ్.
2. రెండవ రౌండ్ 1949లో ఫ్రాన్స్‌లోని అన్నెసీలో జరిగింది. 34దేశాలు పాల్గొన్నాయి.
3. మూడవరౌండ్ టార్క్వే 1950-51లో, నాల్గవరౌండ్ జెనీవా 1956లో, 5వ రౌండ్ 1960-61లో జెనీవాలో జరిగింది. దీనినే డల్లాన్ రౌండ్ అంటారు. 6వ రౌండ్ (కెన్నెడీ రౌండ్) 1964-67 జెనీవాలో 7వ రౌండ్ (టోక్యో రౌండ్) 1973-79 జెనీవాలో జరిగింది.
4. 8వ రౌండ్ 20 సెప్టెంబరు 1986న ఉరుగ్వేలోని ఉంటాడెల్ ఎస్టే లో ప్రారంభమైనది. మరియు 15 ఏప్రిల్ 1994న మొరాకోలోని మర్రకేష్‌లో అధికారికంగా ముగిసింది. 123 దేశాలు ఈ సమావేశంలో పాల్గొన్నాయి.

మొదటి ఆరు సమావేశాల్లో సుంకాల తగ్గింపుపై చర్చించడం జరిగింది ఏడవ సమావేశం సుంకేతర అంశాలపై చర్చించింది. ఎనిమిదవ సమావేశం గత సమావేశాల కంటే పూర్తిగా భిన్నమైనది. దీనిలో అనేక కొత్త అంశాలు పరిశీలనకు వచ్చాయి. ఈ సమావేశాన్నే ఉరుగ్వే రౌండ్ అని అంటారు. ఈ సమావేశంలోనే ప్రపంచ వర్తక సంస్థ (డబ్ల్యుటిఓ) స్థాపనకు శ్రీకారం చుట్టబడింది.

**డంకెల్ ప్రతిపాదనలు :** ఉరుగ్వే రౌండ్ 20 సెప్టెంబరు 1986లో ప్రారంభమైనది. ఈ సమావేశంలో సభ్యదేశాల మధ్య తలెత్తిన వివిధ రకాల అభిప్రాయాలను క్రోడీక రించి, అప్పటి గాట్ డైరెక్టర్ జనరల్ ఆర్థర్ డంకెల్ ఒక విస్తృతమైన డాక్యుమెంట్‌ను రూపొందించారు. దీనినే డంకెల్ ప్రతిపాదనలు అంటారు.

**డంకెల్ ప్రతిపాదనలో పొందుపరచిన కొన్ని ముఖ్యమైన అంశాలు:** సుంకాలు, సుంకేతర అంశాలు, వస్త్ర పరిశ్రమ, వ్యవసాయం, సబ్సిడీలు, బహుళవర్తక ఒప్పందాలు, వ్యాపార సంబంధిత మేథో సంపత్తి హక్కులు, వర్తక సేవల్లో సాధారణ ఒప్పందం మొదలైనవి.

**ప్రపంచ వర్తక సంస్థ (వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్-డబ్ల్యుటిఓ) :** 15, ఏప్రిల్ 1994లో మొరాకో దేశంలోని మర్రకేష్ నగరంలో భారతదేశంతో సహా 117 గ్యాట్ సభ్యదేశాలు డంకెల్ ప్రతిపాదనలను ఆమోదిస్తూ డబ్ల్యు.టి.ఓ.ను ఏర్పాటు చేయాలని సూచించాయి. జనవరి 1, 1995లో భారత్‌తో సహా 128 సభ్యదేశాలతో.

ఉరుగ్వే సమావేశంలో ఒప్పందం చేసుకున్న మొత్తం అంశాలు 14. వీటిని ప్రతి సభ్యదేశం తప్పకుండా ఒప్పుకొని పాటించాల్సి ఉంటుంది. మొదటి భాగంలో ఈ క్రింది 14 అంశాలను చేర్చారు. అవి

1. సుంకాలు
2. సుంకేతర చర్యలు
3. భౌగోళిక ఉత్పత్తులు
4. జాతీయ వనరుల ఆధారిత వస్తువులు
5. జౌళి, వస్త్రాలు
6. వ్యవసాయం
7. రక్షించే అంశాలు
8. సబ్సిడీలు
9. గాట్ యొక్క ప్రకరణలు
10. తగాదాల పరిష్కారం
11. బహుళ వ్యాపార ఒప్పందాల నిర్వహణ
12. మేథో సంపత్తి హక్కులు
13. వ్యాపార సంబంధిత పెట్టుబడి కొలమానాలు
14. గాట్ విధులు

రెండవ భాగంలో సేవారంగంలో వ్యాపారాన్ని ప్రవేశపెట్టి పైన తెల్పిన 14 అంశాలను 7 అంశాలుగా పునర్వర్గీకరించారు. అవి

1. మార్కెట్ అవకాశాలు
2. వ్యవసాయం
3. టెక్స్‌టైల్స్
4. వ్యాపార సంబంధిత మేథాసంపత్తి హక్కులు
5. వ్యాపార సంబంధిత పెట్టుబడి కొలమానాలు
6. సేవల వ్యాపారం
7. సంస్థాపరమైన అంశాలు

**ప్రపంచ వర్తక సంస్థ (వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్-డబ్ల్యు.టి.ఓ.)** - 15, ఏప్రిల్ 1994లో మొరాకో దేశంలోని మర్రకేష్ నగరంలో భారతదేశంతో సహా 117 గ్యాట్ సభ్యదేశాలు డంకెల్ ప్రతిపాదనలను ఆమోదిస్తూ డబ్ల్యు.టి.ఓ.ను ఏర్పాటు చేయాలని సూచించాయి.

భారతదేశం ఈ ఒప్పందంపై ఏప్రిల్ 15, 1994న సంతకం చేసింది.

జనవరి 1, 1995లో భారత్‌తో సహా 128 సభ్యదేశాలతో డబ్ల్యుటిఓ ఆవిర్భవించింది. డబ్ల్యుటిఓ ప్రధాన కార్యాలయం స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో ఉన్నది.




డబ్ల్యుటిఓ నిబంధనలు శాశ్వతమైన రూపంలో సంపూర్ణంగా ఉండే ఒక చట్టబద్ధమైన మరియు అధికారిక సంస్థ.

2009 నాటికి 153దేశాలు డబ్ల్యుటిఓ సభ్య దేశాలుగా ఉన్నాయి. 14 జులై 2016లో 163వ దేశంగా లైబీరియా, 29 జులై 2016న 164వ సభ్యదేశంగా ఆఫ్ఘనిస్తాన్ చేరినవి. 26 ఫిబ్రవరి 2024న అబుదాబిలో జరిగిన 13వ మంత్రివర్గ సమావేశంలో కొమురోస్ మరియు తైమూర్ లెస్టే 165వ సభ్యులుగా ఆమోదించబడ్డాయి.


**లక్ష్యాలు :**

1. సభ్యదేశాల్లో జీవన ప్రమాణాలను పెంచడంతో పాటు వ్యాపారాన్ని నిజ ఆదాయాన్ని అధికం చేయడం, ప్రపంచ వనరులను అభిలషణీయంగా వాడడం.
2. బహుసాధక వాణిజ్య వ్యవస్థను అభివృద్ధి చేయడం.
3. టారిఫ్ మరియు నాన్ టారిఫ్ ప్రతిబంధకాలను తొలగించడం.
4. అంతర్జాతీయ వాణిజ్య సంబంధాలలో వివక్షతలను తొలగించడం.
5. వాణిజ్య విధానాలు, పర్యావరణ విధానాలు మరియు సుస్థిర అభివృద్ధి మధ్య సమన్వయం చేయడం.
6. నిర్ణయం తీసుకునే పద్ధతుల స్పష్టతను మెరుగు పరచడం, వాణిజ్య వివాదాలను పరిష్కరించడం.

**డబ్ల్యుటిఓ-విధులు:**

డబ్ల్యుటిఓ విధానాలు వివక్షరహితం, పరస్పరం అమలుచేయదగిన కట్టుబాట్లు, పారదర్శకత మరియు భద్రత విలువలు అనే ఐదు సూత్రాలపై నిర్మించబడ్డాయి.

1. ప్రపంచదేశాల మధ్య స్వేచ్ఛగా వర్తక వ్యవహారాలు జరిగేలా చూడడం.
2. బహుళ వ్యాపార ఒప్పందాలు, ద్వైపాక్షిక ఒప్పందాలు, సంస్థ ఆశయాలు, పరిపాలన మొదలైనవాటి అమలు కోసం సౌకర్యాలను కల్పించడం.
3. అభివృద్ధి చెందుతున్న దేశాలకు సాంకేతిక సహాయం మరియు శిక్షణ అందించడం.
4. బహుళ వ్యాపార చర్చలకు వేదికగా పనిచేయడం.
5. వర్తక ఒప్పంద తగాదాల పరిష్కారానికి కృషి చేయడం.
6. ప్రపంచ ఆర్థిక విధానాల రూపకల్పనలో ప్రపంచ బ్యాంకుకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి మరియు వాటి అను బంధ సంస్థలకు డబ్ల్యుటిఓ సహకరిస్తుంది.



ఎం.అన్నారెడ్డి
సీనియర్ ఫ్యాకల్టీ
హనుమకొండ.

# TSPSC Group-I Group-II Exams

# తెలంగాణా జాగ్రఫీ

**తెలంగాణలో రవాణా సౌకర్యాలు**

**1) రోడ్డు రవాణా :**

- ఎన్.హెచ్.-7 (కొత్త నెంబరు :44) :మహారాష్ట్ర సరిహద్దు నుండి ఆదిలాబాద్- హైదరాబాద్ మీదుగా అనంతపురం వరకు
- ఎన్.హెచ్.-9 (కొత్త నెంబరు 65): కర్ణాటక సరిహద్దు నుండి మెదక్‌లోని జహీరాబాద్ మీదుగా హైదరాబాద్-సూర్యపేట- కోదాడ-విజయవాడ వరకు.
- ఎన్.హెచ్.-16 (కొత్త నెంబరు 63): ఇది నిజామాబాద్-జగిత్యాల-మహారాష్ట్ర సరిహద్దు వరకు
- ఎన్.హెచ్.-202 (కొత్తనెంబరు 163): హైదరాబాద్-యాదగిరి గుట్ట
- ఎన్.హెచ్.-222 (కొత్త నెంబరు 61): నర్సాపూర్-నిర్మల్ వరకు వెళ్ళి ఎన్.హెచ్.-7 ను కలుస్తుంది.
- సికింద్రాబాద్ నుండి కరీంనగర్ మీదుగా రామగుండంను కలుపుతూ ఉన్న రోడ్డు మార్గాన్ని రాజీవ్ రహదారి అంటారు.
- తెలంగాణలో 2వ పెద్ద బస్‌స్టేషన్: బి.ఆర్. అంబేద్కర్, కరీంనగర్.

**2. రైల్వే రవాణా :**

- 1879 సంవత్సరంలో నిజాంస్ గ్యారెంటీడ్ స్టేట్ రైల్వే పేరుతో నిజాం రైల్వే సంస్థ స్థాపించబడినది.
- రాష్ట్రంలో నిర్మించబడిన మొట్టమొదటి రైల్వే లైను : సికింద్రాబాద్-వాడి
- రాష్ట్రంలో విద్యుదీకరణ చేయబడిన మొట్టమొదటి రైల్వే ట్రాక్: మధిర (ఖమ్మం)-విజయవాడ 1972
- తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ఒకే ఒక్క రైల్వే జోన్ : దక్షిణ మధ్య రైల్వే జోన్ (ఎస్‌సిఆర్) 1966

**3. వాయు రవాణా :**

- రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం (శంషాబాద్ -హైదరాబాద్) 2005లో నిర్మాణం ప్రారంభం. 2008 మార్చి 23 నుండి విధులు నిర్వహించడం.
- తెలంగాణ రాష్ట్రంలో మొట్టమొదటి గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు ఇది.
- బేగంపేటలో దేశీయ విమానాశ్రయం కూడా కొనసాగుతోంది.
- ఈ విమానాశ్రయానికి చేరడానికి పి.వి నరసింహారావు ఎక్స్‌ప్రెస్ హైవే మరియు నెహ్రూ ఔటర్ రింగ్‌రోడ్డు తన సేవలను అందిస్తుంది.

**4. జలరవాణా :**

- తెలంగాణకు సముద్రమావరించి లేనందున నీటి మార్గాలు లేవు.
- గోదావరి-కృష్ణ నదుల్లో పడవలు, చిన్నచిన్న స్టీమర్లు ద్వారా తెప్పల ద్వారా ప్రయాణికులను చేరవేయడం జరుగుతుంది.
- శ్రీశైలం నుండి నాగార్జునసాగర్‌కు, భద్రాచలం నుండి పోలవరం మరియు రాజమండ్రిలకు సంవత్సరంలో కొద్ది కాలం స్టీమర్లు నడుస్తాయి.

**1. తెలంగాణలో అతిపెద్ద బస్‌స్టేషన్ ఏది? ఎక్కడ ఉన్నది?**
1. మహాత్మాగాంధీ బస్ స్టేషన్ - హైద్రాబాద్
2. డా. బిఆర్ అంబేద్కర్ బస్ స్టేషన్ - కరీంనగర్
3. హన్మకొండ బస్ స్టేషన్ - హన్మకొండ
4. ఖమ్మం బస్ స్టేషన్ - ఖమ్మం.

**2. తెలంగాణ రాష్ట్రంలో మొట్టమొదటి రోడ్డు మార్గాన్ని ఏ ప్రాంతాల మధ్య నిర్మించడం జరిగింది?**
1. హైదరాబాద్ - వాడి
2. హైదరాబాద్-షోలాపూర్
3. హైదరాబాద్-గోపాలపురం
4. హైదరాబాద్-బీదర్

**3. దేశంలోనే తొలి డిజిటల్ రైల్వే స్టేషన్ ఏది?**
1. నాంపల్లి 2. బాసర
3. కాచిగూడా 4. సికింద్రాబాద్

**4. క్రింది వాటిని జతపరుచుము**

| విమానాశ్రయం | ప్రాంతం |
|---|---|
| 1. బేగంపేట | ఎ. శంషాబాద్ |
| 2. రామగుండం | బి. వరంగల్ |
| 3. మామునూరు | సి. పెద్దపల్లి |
| 4. ఎన్.టి.ఆర్ | డి. హైదరాబాద్ |

1. 1-ఎ, 2-బి, 3-సి, 4-డి
2. 1-సి, 2-డి, 3-బి, 4-ఎ
3. 1-బి, 2-డి, 3-ఎ, 4-సి
4. 1-డి, 2-సి, 3-బి, 4-ఎ

**5. మహాత్మాగాంధీ బస్‌స్టేషన్ గురించి సరైన ప్రవచనాలను గుర్తించుము**
ఎ. దీని పాతపేరు ఇమ్లీబన్ బస్ స్టేషన్
బి. ఇది హైదరాబాద్‌లో గౌలిగూడలో ఉన్నది
సి. మూసినది యొక్క ఇమ్లీబన్ ద్వీపంలో ఈ బస్ స్టేషన్ నిర్మించారు.
డి. ఆసియాలోనే '3'వ అతిపెద్ద బస్ స్టేషన్
1. ఎ మరియు బి 2. బి మరియు సి
3. ఎ,బి మరియు సి 4. ఎ,బి,సి,డి

**6. భారత్ మాల ప్రాజెక్టులో లేనటువంటి దానిని గుర్తించండి.**
1. సంగారెడ్డి-చంద్రాపూర్-రామగుండం
2. జగిత్యాల-కరీంనగర్-వరంగల్-ఖమ్మం
3. ఆర్మూర్-మంచిర్యాల-రామగుండం
4. సంగారెడ్డి-నాందేడ్-అకోలా

**7. రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం క్రింది ఏ వాటా ప్రకారం నిర్మించబడినది?**
1. జి.ఎం.ఆర్. గ్రూప్ వాటా 44%
2. మలేషియా ఎయిర్‌పోర్ట్స్ హోల్డింగ్స్ బెర్హార్డ్ - 11%
3 తెలంగాణ ప్రభుత్వం వాటా - 12%
4. ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా-13%

**8. సర్వీస్ విత్ కమిట్‌మెంట్, ప్రోగ్రెసివ్ విత్ ప్రైడ్ అనే నినాదం ఏ సెంట్రల్ రైల్వే యొక్క నినాదం?**
1. ఉత్తర మధ్య రైల్వే 2. పడమరమధ్య రైల్వే
3. దక్షిణమధ్య రైల్వే 4. తూర్పుమధ్య రైల్వే

**9 తెలంగాణ రాష్ట్రంలో క్రింది వాటిలో అతిపెద్ద రాష్ట్ర రహదారి ఏది?**
1. రాష్ట్ర రహదారి-18 2. రాష్ట్ర రహదారి-1
3. రాష్ట్ర రహదారి-16 4.రాష్ట్ర రహదారి-15

**10. క్రింది వానిలో సరియైన ప్రవచనాలను గుర్తించుము.**
ఎ. శ్రీశైలం నుండి నాగార్జున సాగర్‌కు కృష్ణానది జలరవాణా ఉన్నది.
బి. భద్రాచలం నుండి రాజమండ్రి వరకు గోదావరి నది జలరవాణా ఉన్నది
సి. కాకతీయుల కాలంలో మోటుపల్లి ఓడరేవును ఉపయోగించుకున్నారు.
డి. తెలంగాణ తీరరేఖ 272 కి.మీ. చే ఉన్నది.
1. ఎ మరియు బి 2. బి మరియు సి
3. ఎ,బి మరియు సి 4. ఎ,బి,సి,డి

**11. క్రింది వాటిని పరిశీలింపుము**
ప్రతిపాదన (ఎ) - తెలంగాణలో మొదటి రైల్వేలైన్ సికింద్రాబాద్-వాడీల మధ్య నిర్మించారు.
కారణం(ఆర్)-నిజాం రైల్వే ఆధ్వర్యంలో మొదటి రైల్వే నిర్మింపబడ్డాయి.
1. (ఎ) మరియు (ఆర్) సరైనవే మరియు (ఆర్), (ఎ)కు సరైన వివరణ
2. (ఎ) మరియు (ఆర్) రెండూ సరైనవే, కాని (ఆర్), (ఎ)కు సరైన వివరణ కాదు.
3. (ఎ) నిజమైనది కాని (ఆర్) నిజమైనది కాదు.
4. (ఎ) తప్పు కాని (ఆర్) నిజమైనది.

**12. పి.వి. నరసింహారావు ఎక్స్‌ప్రెస్ హైవే ఎక్కడ నుండి ఎక్కడ వరకు ఉన్నది?**
1. ఎమ్‌జిబిఎస్ నుండి శంషాబాద్ వరకు
2. జెబియస్ నుండి శంషాబాద్ వరకు
3. బేగంపేట ఎయిర్‌పోర్ట్ నుండి రాజీవ్‌గాంధీ ఎయిర్‌పోర్టు వరకు
4. మెహదీపట్నం (హైదరాబాద్) నుండి రాజీవ్‌గాంధీ ఎయిర్‌పోర్ట్ వరకు.

**13. తెలంగాణలో రైల్వేబోగీలు తయారు చేస్తున్న ప్రాంతం ఏది?**
1. కాజీపేట 2. మౌలాలి
3. సికింద్రాబాద్ 4. కాచిగూడ

**14. క్రింది వాటిని పరిశీలింపుము**
ప్రతిపాదన (ఎ) - రవాణా మార్గాలన్నింటిలో కెల్లా అతితక్కువ ఖర్చుతో కూడుకున్న రవాణాగా జలరవాణా పేర్కొంటారు.
కారణం (ఆర్) - నీటికి కదిలే గుణం ఉండడం వలన దానిపై తేలే వస్తువులను సులభంగా కదిలిస్తుంది.




1. (ఎ) మరియు (ఆర్) రెండూ సరైనవే మరియు (ఎ)కి (ఆర్) సరియైన వివరణ.
2. (ఎ) మరియు (ఆర్) సరైనవే మరియు (ఎ)కి (ఆర్) సరియైన వివరణ కాదు.
3. (ఎ) నిజమైనది కాని (ఆర్) నిజమైనది కాదు.
4. (ఎ) నిజమైనది కాదు కాని (ఆర్) నిజమైనది.

**15. నిజామ్స్ గ్యారెంటీడ్ స్టేట్ రైల్వే పేరుతో రాష్ట్రంలో నిజాం రైల్వే సంస్థను ఏ సం.లో ప్రారంభించారు?**
1. 1868 2 1890
3. 1878 4. 1897

**16. క్రింది వానిలో సరైన ప్రవచనాలను గుర్తించుము**
ఎ. ఇంగ్లీష్ అక్షరాలను అనుబంధంగా కలిగి ఉన్న రహదారులు చిన్నచిన్న రహదారులు
బి. రాష్ట్ర రహదారులు రాష్ట్ర రవాణా మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఆర్&బి నిర్వహిస్తుంది.
సి. రాష్ట్రంలో ప్రస్తుతం '24' రాష్ట్ర రహదారులు ఉన్నాయి
డి. రాష్ట్ర రహదారులు దేశ రోడ్ నెట్‌వర్క్‌లో 2.92% కలిగి ఉన్నాయి.
1. ఎ మరియు బి 2. బి మరియు సి
3. ఎ,బి మరియు సి 4. ఎ,బి,సి,డి

**17. తెలంగాణలో విద్యుదీకరణ చేయబడిన మొట్టమొదటి రైల్వే ట్రాక్ ఎప్పుడు ఎక్కడ నిర్మించారు?**
1. మహబూబాబాద్-విజయవాడ (1972)
2. మధిర-విజయవాడ (1972)
3.కాజీపేట-విజయవాడ (1976)
4. మధిర-ఖమ్మం (1970)

**18. తెలంగాణ రాష్ట్రంలో మొట్టమొదటి గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్‌కి సంబంధించి సరియైన అంశాలను గుర్తించండి.**
ఎ. రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం
బి.ఎన్.టి.రామారావు జాతీయ టెర్మినల్ విమానాశ్రయం
సి. శంషాబాద్ విమానాశ్రయం
డి. బేగంపేట దేశీయ విమానాశ్రయం
1. ఎ మరియు బి 2. బి మరియు సి
3 ఎ,బి మరియు సి 4. ఎ,బి,సి,డి

**19. మెట్రోమాన్ ఆఫ్ ఇండియాగా పిలవబడే వ్యక్తి ఎవరు?**
1. శ్రీధరన్ 2. ముల్లైత్తన్
3. కాళిదాస్ 4. ఎమ్.ఎస్. స్వామినాథన్

**20. రాష్ట్రంలో రహదారులు తక్కువగా ఉన్న జిల్లా ఏది?**
1. కరీంనగర్ 2. పెద్దపల్లి
3. హైదరాబాద్ 4. ఆదిలాబాద్

**21. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి ఏయే రోడ్లును తన సర్వీసులను అందిస్తుంది?**
1. పి.వి. నరసింహారావు ఎక్స్‌ప్రెస్ హైవే
2. జవహర్‌లాల్ నెహ్రూ ఔటర్ రింగ్ రోడ్
3. రాజీవ్‌గాంధీ జాతీయ రహదారి
4. మహాత్మాగాంధీ అంతర్జాతీయ రహదారి
1. ఎ మాత్రమే 2. ఎ మరియు బి
3. బి మాత్రమే 4. ఎ,బి,సి,డి

**22. సికింద్రాబాద్ నుండి కరీంనగర్ మీదుగా రామగుండం వరకు ఉన్న జాతీయ రహదారిని ఏమని పిలుస్తారు?**
1. పి.వి. నరసింహారావు ఎక్స్‌ప్రెస్ హైవే
2. రామగుండం జాతీయ రహదారి
3. సిద్దిపేట జాతీయ రహదారి
4. రాజీవ్‌గాంధీ జాతీయ రహదారి

**23. జాతీయ రహదారులు లేని జిల్లా?**
1. పెద్దపల్లి 2. కరీంనగర్ 3 .
హైదరాబాద్ 4. సిద్దిపేట

**24. తెలంగాణ రాష్ట్రంలో అతిచిన్న జాతీయ రహదారి ఏది?**
1. ఎన్.హెచ్.-363 2. ఎన్.హెచ్.-365
3. ఎన్.హెచ్.-150 4. ఎన్.హెచ్.-167

**25. క్రింది వాటిని పరిశీలింపుము**
ప్రతిపాదన (ఎ) - వాయు రవాణా అత్యంత వేగవంతమైనది మరియు ఖర్చుతో కూడుకున్నది.
కారణం (ఆర్) - దేశం మొత్తం మీద విమానాశ్రయం కలిగివున్న ఏకైక సంస్థానం నిజాం సంస్థానం.
1. (ఎ) మరియు (ఆర్) రెండూ సరైనవే మరియు (ఎ)కి (ఆర్) సరియైన వివరణ.
2. (ఎ) మరియు (ఆర్) సరైనవే మరియు (ఎ)కి (ఆర్) సరియైన వివరణ కాదు.
3. (ఎ) నిజమైనది కాని (ఆర్) నిజమైనది కాదు.
4. (ఎ) నిజమైనది కాదు కాని (ఆర్) నిజమైనది.

**26. హైదరాబాద్ దక్కన్ రైల్వే స్టేషన్ అని ఏ స్టేషన్‌ని పిలిచేవారు?**
1. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్
2. కాచిగూడ రైల్వే స్టేషన్
3. హైదరాబాద్ రైల్వే స్టేషన్
4. నాంపల్లి రైల్వే స్టేషన్

**జవాబులు : 1)1, 2)2, 3)3, 4)4, 5)4, 6)1, 7)2, 8)3, 9)2, 10)3, 11)1, 12)4, 13)2, 14)1, 15)3, 16)4, 17)2, 18)3, 19)1, 20)3, 21)2, 22)4, 23)1, 24)3, 25)2, 26)4**



పాదం సుధాకర్
ఫ్యాకల్టీ, హైదరాబాద్.

ఏఎస్ఓ, బ్యాంక్ ఎగ్జామ్ స్పెషల్

# ఆర్థిక గణాంకశాస్త్రము

ప్రాక్టీస్ ప్రశ్నలు

**1. గణాంక శాస్త్రాన్ని అంచనాల మరియు సంభావ్యతల శాస్త్రంగా నిర్వచించిన వారు**
ఎ. బోరబ్ సెక్రిస్ట్ బి. భౌలే
సి. బౌలే మరియు కెండాల్ డి. బోడింగ్ టన్

**2. ప్రస్తుతం వాడుకలో ఉన్న స్టాటిస్టిక్స్ అనే మాట యొక్క వయస్సు ఎంత?**
ఎ. ఒక శతాబ్దం బి. 5 శతాబ్దాలు
సి. ఒక దశాబ్దం డి. 2 శతాబ్దాలు

**3. గణాంక శాస్త్రం......**
ఎ. దేనిని నిరూపించదు
బి. దేనినైనా నిరూపిస్తుంది. సి. ఒక పరికరం
డి. పైవేవీ కావు

**4. గణాంక శాస్త్రం ఒక......**
ఎ. శాస్త్రం బి. కళ
సి. కళకాదు మరియు శాస్త్రం కాదు
డి. కళ మరియు శాస్త్రం

**5. గణాంకశాస్త్ర పద్దతుల అభివృద్ధిలో ఎవరిపాత్ర ఎక్కువగా ఉంటుంది?**
ఎ. శాస్త్రజ్ఞులు బి. ఆర్థిక వేత్తలు
సి. గణితశాస్త్రవేత్తలు డి. వ్యాపారవేత్తలు

**6. గణాంకశాస్త్ర సిద్ధాంతాల అభివృద్ధిలో వీరిపాత్ర ఎక్కువ**
ఎ. గాస్బి. ఫిషర్ సి. భౌలే డి. పియర్సన్

**7. సర్వేయొక్క పరిధి దీనిపై ఆధారపడి ఉంటుంది.**
ఎ. లభ్యమయ్యే సమయం బి.లక్ష్యం
సి. వనరులు డి. పైవన్నీ

**8. విశ్లేషణ మరియు సమర్పణ యందు ఇవి కలిసి ఉంటాయి.**
ఎ. గుణకాలు బి. రేట్లు
సి. నిష్పత్తులు మరియు శాతాలుడి. పైవన్నీ

**9. పరిశోధన పరిధిలోని జనాభా సంఖ్య అపరిమితమైనపుడు ఉపయోగించే వద్ధతి ఏమనగా**
ఎ. జనాభా విచారణ పద్ధతి
బి. ప్రతిచయన పద్ధతి
సి. ప్రతిచయన లేక జనాభా విచారణ పద్ధతి
డి. పైవేవీ కావు

**10. ప్రైవేటుగా నిర్వహించు సర్వేలందు ప్రతిస్పందనా శాతం ఎంత'**
ఎ. 75% బి. 50% కన్నా తక్కువ
సి. 25% కన్నా తక్కువ డి. 50%

**11. ద్వితీయ దత్తాంశమును ఎలా వాడాలి?**
ఎ. పరోక్షంగా వాడరాదు
బి. జాగ్రత్తగా పరిశీలించిన తరువాత వాడాలి
సి. దత్తాంశం సేకరించిన వారిని గురించి మాత్రం పరిశీలించాలి
డి.ఉపయోగానికి ముందు పరిశీలన అవసరం లేదు.

**12. దత్తాంశాన్ని సాధారణంగా దేనినుండి సేకరిస్తారు?**
ఎ. ద్వితీయ వనరులు
బి. ప్రాథమిక వనరులు
సి. ప్రాథమిక మరియు ద్వితీయ వనరులు
డి. పైవేవీ కావు

**13. గణాంక పద్ధతుల నిర్మాణం దేనిని కలిగి ఉండును?**
ఎ. సంపూర్ణం బి. ఖచ్చితత్వం
సి. తగినంతగా ఉండాలి డి. పైవన్నీ

**14. ప్రాథమిక దత్తాంశం ఎల్లపుడూ....**
ఎ. దత్తాంశ సేకరణ ఏజెన్సీపై ఆధారపడి ఉంటుంది.
బి. ద్వితీయ దత్తాంశం కన్నా తక్కువగా నమ్మదగినదిగా ఉంటుంది.
సి. దత్తాంశ సేకరణలో తీసుకున్న జాగ్రత్తలపై ఆధారపడి ఉంటుంది.
డి. ద్వితీయ దత్తాంశంతో పోల్చినపుడు ఇది చాలా నెమ్మదిగా ఉంటుంది.


**15. ప్రశ్నావళి నందు ఉండవలసిన ప్రశ్నల సంఖ్య**
ఎ.20 బి 15
సి. 5 డి. వీటిలైనన్ని తక్కువ

**16. ప్రాథమిక దత్తాంశాన్ని విశ్లేషించినపుడు ముందుగా ప్రశ్నావళి యందు సమాచారం .......... గా ఉన్నదో లేదో చూడవలెను.**
ఎ. స్థిరత్వం బి. సంపూర్ణం
సి. ఏకరూపం డి. పైవన్నీ

**17. రేఖాచిత్రాలు మరియు చిత్రపటాలు వీటియొక్క పరికరాలు**
ఎ. దత్తాంశ సేకరణ బి. విశ్లేషణ
సి. సమర్పణ డి. క్లుప్తీకరణ

**18. ద్విపరమాణు చిత్రమందు వీటిని మాత్రమే పరిగణనలోనికి తీసుకుంటారు.**
ఎ. కేవలం వెడల్పు బి. కేవలం ఎత్తు
సి. కేవలం వెడల్పు ఎత్తులు మాత్రమే
డి. ఎత్తు, వెడల్పు మరియు మందము

**19. దత్తాంశ సమర్పణలో వీటిని వదిలి వేయుట చాలా ఆమోదయోగ్యమైన విషయం**
ఎ. ఘనాలు మరియు వృత్తాలు బి. పై చిత్రాలు
సి. బార్‌లు డి. సోపాన పటాలు



**20. వ్యక్తిగత శ్రేణులందు దీనినుండి వచ్చిన విచల నాల మొత్తం సున్న అవుతుంది.**
ఎ. మధ్యగతం బి. బాహుళకం
సి. గుణమధ్యమము డి. అంకమధ్యమము

**21. దత్తాంశములోని అధిక విలువల ప్రభావం వల్ల ఈ సగటు ఎక్కువ ప్రభావవంతమవుతుంది.**
ఎ. మధ్యగతం బి. గుణమధ్యమం
సి. అంకమధ్యమము డి. బాహుళకం

**22. 8 మరియు 18ల గుణమధ్యమము విలువ ఎంత?**
ఎ. 13 బి. 15 సి. 12 డి. 108

**23. ఒక వైష మ్యీకృతం చేయబడిన దత్తాంశం యొక్క అంకమధ్యమం, మధ్యగతములు వరుసగా 5 మరియు 0 కాగా, బాహుళకం విలువ సుమారుగా**
ఎ. 8 బి. 16 సి. 8 డి. పైవేవీ కావు

**24. చతుర్ధాంశ విచలన గుణకం కనుగొనుటకు సూత్రం**
ఎ.(Q3+Q1)/2 బి. (Q+Q1)/2
సి. (Q3-Q1) / Q3+Q1
డి. (Q2+Q1) / (Q2-Q1)

**25. టైమ్ రివర్సల్ టెస్టును తృప్తిపరచాలంటే**
ఎ. $P_{01}$ x $P_{10}$=0
బి. $P_{01}$ x $P_{10}$=1
సి. $P_{01}$ x $P_{10}$>1
డి. $P_{01}$ x $P_{10}$<1

**26. సర్క్యులర్ టెస్ట్‌ను తృప్తి పరచాలంటే**
ఎ. $P_{12}$ x $P_{23}$ x $P_{31}$=1
బి. $P_{12}$ x $P_{23}$ x $P_{31}$=0
సి. $P_{12}$ x $P_{23}$ x $P_{13}$=1
డి. $P_{12}$ x $P_{32}$ x $P_{31}$=0

**27. చక్రీయ మార్పులు వీటివల్ల వస్తాయి.**
ఎ. వరదలు బి. యుద్ధాలు
సి. భూకంపాలు డి. పైవేవీ కావు

**28. రెండు పట్టణాల ఆరోగ్య పరిస్థితులు అంచనా వేయాలంటే దేనిని గణించాలి?**
ఎ. ప్రామాణిక మరణ రేటు
బి. ప్రామాణిక జనన రేటు
సి. అపరిష్కృత మరణరేటు
డి. గ్రేడ్ మరణ రేటు

**29. నికర పునరుత్పత్తి రేటు ఒకటి కన్నా తక్కువగా ఉన్నట్లు అయితే జనాభా పెరుగుదల**
ఎ. స్థిరంగా ఉంటుంది బి. పెరుగుతుంది
సి. తగ్గుతుంది డి. పైవేవీ కావు

**30. ఋణ స్వభావ వైషమ్య విభాజనం అంటే**
ఎ. బాహుళకము<మధ్యగతము=అంకమధ్యమము
బి. బాహుళకము<మధ్యగతము>అంకమధ్యమము
సి. మధ్యగతము>బాహుళకము<అంకమధ్యమము
డి. బాహుళకము<మధ్యగతము<అంకమధ్యమము

**31. కారల్ పియర్‌షన్ వైషమ్య గుణకానికి, బౌలే వైషమ్య గుణకానికి తేడా ఏమిటి?**
ఎ. తక్కువ బి. ఎక్కువ
సి. సంబంధం లేదు డి. సమానం

**32. విభాజనం ధన విలువలను కలిగి ఉన్నట్లయితే, ఆ విభాజనం యొక్క అంకమధ్యమం విలువ**
ఎ. బాహుళకం కన్నా తక్కువ
బి. బాహుళకానికి సమానం
సి. బాహుళకం కన్నా ఎక్కువ డి. పైవేవీ కావు

**33. ఋతుపరమైన మార్పులను కొలుచుటకు ఎక్కువ అమలులో ఉన్న పద్ధతి ఏది?**
ఎ. నిష్పత్తి ప్రవృత్తి పద్ధతి బి. సాపేక్ష పద్ధతి
సి. నిష్పత్తి చలిత మాధ్యమాల పద్ధతి
డి. సామాన్య సగటు పద్ధతి

**34. వైషమ్య గుణక విలువ సున్నా అయినట్లయితే విభాజనం ............ గా ఉంటుంది.**
ఎ. జె ఆకారంలో
బి. సౌష్టవాకారం
సి. యు ఆకారంలో
డి. ఎల్ ఆకారంలో

**35. స్థూల పునరుత్పత్తి రేటు ఒకటి కన్నా ఎక్కువ ఉన్నట్లయితే**
ఎ. జనాభా పెరుగుతుంది
బి. పెరగదు లేక తగ్గదు
సి. జనాభా తగ్గుతుంది
డి. ఇవి ఏవీ కావు

**36. మన దేశంలో జనాభా లెక్కల సేకరణ ఎన్ని సంవత్సరాలకు ఒకసారి జరుగును?**
ఎ. ప్రతి సంవత్సరం
బి. 5 సంవత్సరాలకు ఒకసారి
సి. 8 సంవత్సరాలకు ఒకసారి
డి. ప్రతి 10 సంవత్సరాలకు ఒకసారి

**37. భారతదేశంలో మొట్టమొదటిసారిగా జాతీయ ఆదాయ అంచనాలు వేసినవారు**
ఎ. వికెఆర్‌వి రావ్ బి. దాదాబాయి నౌరోజీ
సి. మహల నోబిస్ డి. సి.ఆర్. రావ్

**38. కేంద్ర గణాంక వ్యవస్థ (సి.యస్.ఓ.)ను స్థాపించిన సంవత్సరం**
ఎ. 1946 బి. 1961
సి. 1951 డి. 1956

**39. దత్తాంశంలోని అధిక విలువ ప్రభావంలో తక్కువ ప్రభావం అయ్యే విస్తరణ మానం ఏది?**
ఎ. మాధ్యమిక విచలనం బి. వ్యాప్తి
సి. చతుర్ధాంశ విచలనం
డి. ప్రామాణిక విచలనం

**40. పిషర్ యొక్క ఆదర్శ సూచీ సంఖ్య**
ఎ. లాస్పియరే మరియు పాషే సూచీ సంఖ్యల సగటు
బి. లాస్పియర్ మరియు పాషే సూచీ సంఖ్యల గుణమధ్యమ విలువ
సి. లాస్పియర్ కంటే పాషే సూచి సంఖ్య ఎక్కువ
డి. పైవేవీ కావు

**41. ఒక సౌష్టవ విభాజనం నందు**
ఎ. AM>GM>HM
బి. AM<GM<HM
సి. GM>AM>HM
డి. AM=GM=HM

**42. ప్రతిచయనం కాని పద్ధతులందు ఇవి కలసి ఉంటాయి.**
ఎ. తప్పులు బి. దోషాలు
సి. తప్పులు మరియు దోషాలు డి. ఏవీ కావు


**43. గణాంక శాస్త్రం నందు 'దోషము' అను పదమునకు అర్థం**
ఎ. దోషాలు బి. తప్పులు
సి. తప్పులు మరియు దోషాలు
డి. గణాంకాల విలువకు సంబంధిత వాస్తవ విలువకు తేడా

**44. ప్రతిచయన దోషాలు ఇందులో ఉంటాయి**
ఎ. ప్రతిచయన సర్వే
బి. పూర్తి విచారణ సర్వే
సి. ప్రతిచయన పద్ధతి కాదు, జనా విచారణ పద్ధతి కాదు.
డి. జనాభా విచారణ పద్ధతి మరియు ప్రతిచయన పద్ధతి

**45. రాండమ్ ప్రతిచయన విధానమందు**
ఎ. ప్రతిచయన పరిమాణంతో తగ్గును.
బి. ప్రతిచయన పరిమాణం పెరిగినపుడు ఇది పెరుగుతుంది.
సి. ప్రతిచయన పరిమాణం పెరిగితే ఇది స్థిరంగా ఉంటుంది.
డి. పైవేవీ కావు.

**46. సూచీసంఖ్యల నిర్మాణమందు సిద్ధాంత పరంగా మంచి సగటు ఏది?**
ఎ. అంకమధ్యమము బి. బాహుళకము
సి. మధ్యగతము డి. గుణమధ్యమము

**జవాబులు :** 1)డి, 2)ఎ, 3)సి, 4)ఎ, 5)సి, 6)బి, 7)డి, 8)డి, 9)బి, 10)సి, 11)బి, 12)ఎ, 13)డి, 14)సి, 15)డి, 16)డి, 17)బి, 18)సి, 19)ఎ, 20)డి, 21)సి, 22)సి, 23)ఎ, 24)సి, 25)బి, 26)డి, 27)డి, 28)ఎ, 29)సి, 30)బి. 31)డి, 32)ఎ, 33)సి, 34)బి, 35)ఎ, 36)డి, 37)బి, 38)సి, 39)ఎ, 40)బి, 41)ఎ, 42)సి, 43)డి, 44)ఎ, 45)బి, 46)సి



Dr.M.Reddi Ramu,
Associate Proffessor
Viswam Engineering
College, Angallu

